ఓమ్

# ఛాందోగ్యోపనిషత్

తెలుగుసేత

డా॥ ఈశ్వర వరాహ నరసింహము

ఎమెస్కో

ఓమ్

# ఛాందోగ్యోపనిషద్భూమిక

ఛందశ్శబ్దార్థము.

"ఛన్దాంసియే గాయన్తి తే ఛన్దోగాః"

వేదములందు ౨౪, ౨౮, ౩౨, ౩౬, ౪౦, ౪౪, ౪౮, అక్షరముల క్రమమున గాయత్రీ, ఉష్ణిక్, అనుష్టుప్, బృహతీ, పంక్తి, త్రిష్టుప్, జగతీ నామములతో ఛందస్సులు విదితమగుచున్నవి. ఒక్కొక్క ఛందస్సునకు ఆర్షీ, దైవీ, ఆసురీ, ప్రాజాపత్యా, యాజుషీ, సామ్నీ, ఆర్చీ, బ్రాహ్మీ నామములతో భేదములున్నవి. ఈ ప్రకారము ౭ × ౮ = ౫౬ భేదములు ముఖ్యములని పరిగణింపబడుచున్నవి. ౫౨, ౫౬, ౬౦, ౬౪, ౬౮, ౭౨, ౭౬ అక్షరముల క్రమమున అతిజగతీ, శక్వరీ, అతిశక్వరీ, అష్టి, అత్యష్టి, ధృతి, అతిధృతి నామములతోనున్న ఛందస్సులున్నవి. ౮౦, ౮౪, ౮౮, ౯౨, ౯౬, ౧౦౦, ౧౦౪ అక్షరముల క్రమమున కృతి, ప్రకృతి, ఆకృతి, సఙ్కృతి, అతీకృతి, ఉత్కృతి నామములతో వ్యవహరింపబడు ఛందస్సులున్నవి. మొదట వర్ణించిన గాయత్ర్యాది యేడును ఛందస్సులనియు, అతిజగతీ మొదలైన యేడును అతిఛందస్సులనియు, తృతీయములైన కృతి మొదలైన యేడును, విచ్ఛందస్సులనియు వ్యవహరింప బడుచున్నవి. ఇవి అనంత భేదములతో వర్తిల్లును.

ఛందస్సులను గానము జేయువారు ఛందోగులని వ్యవహరింప బడుదురు. కాని, సామవేదమును గానము జేయు వారియందు ఛందోగ శబ్దము రూఢిగా నున్నది. ఛందస్ పూర్వక శబ్దార్థక గై ధాతువువలన ఛందోగశబ్దము సిద్ధమగును. గై ధాతువువలన కేవలము గానమాత్రమని తాత్పర్యముగాదు. వేదము పఠించుట పఠింపించుట వేదతత్త్వము దెలిసికొనుటయు దెలియజేయుటయు మొదలైన యర్థములును ఉపలక్షణమువలన గ్రహింపవచ్చును. కావున, సామవేదియందు ఛందోగ శబ్దము సాధారణముగా వాడుచున్నను, సామవేదుల ధర్మము, వేదసంబంధ గ్రంథములు, వేదముల దెలిసికొనుట మొదలైన వన్నియు ఛాన్దోగ్యమగును.

ఓమ్

# ఛాందోగ్యోపనిషద్

## ప్రపాఠకః ౧.

ఖండః ౧. ప్రవాకః ౧-౧౦ ఉద్గీథ శబ్ద వాచ్యబ్రహ్మోపాసన

**ఓమిత్యేతదక్షరముద్గీథముపాసీత ।**
**ఓమితి హ్యుద్గాయతి తస్యోపవ్యాఖ్యానమ్ ॥** ౧

౧. [అక్షరం + ఉద్‌గీథం + ఏతత్ + ఓం + ఇతి + ఉపాసీత + హి + ఓం ఇతి + ఉద్ గాయతి; (యద్వా) ఉద్‌గీథం + ఏతత్ + అక్షరం + ఓమితి + ఉపాసీత + హి + ఓమితి + ఉద్ గాయతి + తస్య + ఉపవ్యాఖ్యానమ్]

ఉచ్చస్వరముతో గానము చేయుటకు యోగ్యమైన యీ అవినశ్వరమైన ఓమ్ (బ్రహ్మ) ఉపాసన చేయవలెను. ఏలయన, బ్రహ్మవిదులు ఉచ్చస్వరముతో ఓమ్ గానము చేయుదురు. దాని 'ఉపవ్యాఖ్యానము' ముందు చెప్పబడును. (పక్షాంతరమున అర్థము) ఈ ఉద్గీథనామకము అవినాశమునైన ఓంకార జపము చేయవలెను ఏలయన, బ్రహ్మవిదులు ప్రథమమున ఓంకారముచ్చరించి ఉద్‌గీథాగానము చేయుదురు. దానికి గూఢవ్యాఖ్యానము ముందు చెప్పబడును.

ఓమ్ శబ్దము ఈశ్వరవాచక మనియు, పరమేశ్వరుని నామములలో ముఖ్యతమమనియు, బ్రహ్మవిదుల యభిప్రాయమైయున్నది. ఓంకారము వేదముల సారభూతము; ఉపనిషత్తులలో గానము చేయబడినది. వేదాధ్యయనమునకును సర్వవైదిక కర్మలకును ముందు ఓంకార ముచ్చరింతురు. ఓంకారము అవ్యయము (సర్వదాఏకరూపమున నుండి వ్యాకరణానుసారము విభక్తికృతవికారములు పొందనట్టి శబ్దమును అవ్యయమందురు.)